క్లుప్తంగా

ఎంపీడీవోగా నాగమణి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో నాగమణికి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

ఎటపాక: ఎటపాక మండల పరిషత్ అధికారిగా బి.నాగమణి బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ప్రేమ్‌సాగర్ తన సొంత స్థానం కూనవరం ఎంపీడీవోగా వెళ్లారు. ఎటపాక మండల పరిషత్‌లోనే ఏవోగా కొనసాగుతున్న నాగమణికి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు ఉపాధి హామీ ఏపో రాఘవయ్యతో పాటు పలువురు సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

హుకుంపేట: మద్యం సేవించి వాహనాలు నడిపిన, హెల్మెట్ లేకుండా, లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని సీఐ సన్యాసి నాయుడు చెప్పారు. మండల కేంద్రంలో పోలీసులతో వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు వాహనచోదకులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలన్నారు. గ్రామల్లో గంజాయి, సారా రవాణాలకు దూరంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పథకాలు ప్రారంభం


మొండికోటలో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: మండలంలో సొభం పంచాయతీ మొండికోట, దబ్బగరువు గ్రామాల్లో నవ నిర్మాణ సమితి ద్వారా నిర్మించిన నీటి పథకాలను బుధవారం సర్పంచ్ ఐసరం హనుమంతరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామాల్లోని ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడంతో ఆదివాసీ గిరిజనుల తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సేవలను కొనియాడారు. నవ నిర్మాణ సమితి సభ్యులు, గ్రామ పెద్దలు చిన్నారావు, జగ్గారావు, శ్రీను, సుబ్బారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అహల్యాబాయి హోల్కర్‌కు ఘన నివాళి


నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు, గ్రామస్తులు

పాడేరు రూరల్: మండలంలో సుకూరుగుడ గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మత్తం శాంతకుమారి ఆధ్వర్యంలో అహల్యాబాయి హోల్కర్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాంతకుమారి మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణకు ఆమె చేసిన కృషిని కొనియాడారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు రామకృష్ణ, సత్యవతి, వేమన బాబు, సూర్య, గోపాల్‌పాత్రుడు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేయాలి

రంపచోడవరం: మారేడుమిల్లి మండలం డి.వి.కోట క్లస్టర్‌లో వెలుగు పథకంలో గతంలో జరిగిన రూ.70లక్షల అవినీతిలో సీసీని మాత్రమే బాధ్యులను చేసి సస్పెండ్ చేసి మిగిలిన వారిపై చర్యలు తీసుకోలేదని సీపీఎం కన్వీనర్ మట్ల వాణిశ్రీ ఆరోపించారు. ఈ అవినీతిపై క్షేత్రస్థాయి విచారణ చేసి అప్పటి అధికారులను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతిపై పూర్తిస్థాయి విచారణ చేయాలన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

దేవరాపల్లి: వాకపల్లిలో కనకదుర్గమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. పురోహితులు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్టు గ్రామస్తులు తెలిపారు.



దుంబ్రిగుడలో పీహెచ్‌సీ


కిల్లోగుడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వెతలు తీరేనా

- పీహెచ్‌సీలో సిబ్బందికి కానరాని క్వార్టర్స్
- రాత్రిళ్లు రోగుల సేవలకు తప్పని ఇబ్బందులు

దుంబ్రిగుడ: మండలంలోని అన్ని వేళల్లో రోగులకు సేవలు అందించేందుకు దుంబ్రిగుడ, కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని సేవలు అందుబాటులో తీసుకొచ్చారు. ఆయా పీహెచ్‌సీలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశారు. వివిధ వైద్య పరీక్షల కోసం అధునాతన పరికరాలను ఏర్పాటుచేశారు. వైద్యులు, సిబ్బందిని నియమించారు. అప్పట్లో ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణ వల్ల రోగులకు అన్ని వేళల్లో సేవలు అందేవి. ప్రస్తుతం రోగులకు అన్ని వేళల్లో సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దుంబ్రిగుడు, కిల్లోగుడ పీహెచ్‌సీల్లో సిబ్బంది అందుబాటులో లేక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వైద్య సిబ్బందికి సమీపంలో క్వార్టర్స్ ఏర్పాటుచేయలేదు. దీంతో వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో రోగులకు అన్ని వేళల్లో సేవలందించేందుకు అవకాశం ఉండడం లేదని పలువురు చెబుతున్నారు. దీంతో అటు రోగులకు ఇటు వైద్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కిల్లోగుడ పీహెచ్‌సీ కంటే దుంబ్రిగుడ పీహెచ్‌సీకి రోజువారీ ఎక్కువ ఓపీ ఉంటుంది. దీంతోపాటు రాత్రిళ్లు వివిధ అనారోగ్య సమస్యలతో రోగులు వస్తుంటారు. అయితే వైద్య సిబ్బందికి ఆస్పత్రికి సమీపంలో క్వార్టర్స్ లేకపోవడంతో దూరంలో అద్దె ఇళ్లలో నివాసముంటున్న చోటుకు వెళ్లి తీసుకురావాల్సి వస్తోందని పలువురు రోగులు చెబుతున్నారు. కిలోగుడ పీహెచ్‌సీలోని ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు పీహెచ్‌సీల్లో నైట్ డ్యూటీ చేస్తే వైద్యులు, స్టాఫ్‌నర్సులు ఇతర సిబ్బందికి రక్షణ కొరవడిందంటున్నారు. దుంబ్రిగుడ, కిల్లోగుడ పీహెచ్‌సీ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో వైద్యులు, సిబ్బందికి క్వార్టర్స్ నిర్మించేందుకు ప్రభుత్వ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు వేడుకుంటున్నారు.

ప్రతిపాదనలు పంపాం

దుంబ్రిగుడ, కిల్లోగుడ పీహెచ్‌సీల పరిధిలో వైద్యులు, సిబ్బందికి క్వార్టర్స్ నిర్మాణానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రతిపాదనలు పంపినట్టు డీఎంహెచ్‌వో జమాల్ బాషా చెప్పారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

అధికారులు స్పందించాలి



దుంబ్రిగుడ పీహెచ్‌సీలో సిబ్బంది రాత్రి పుట అందుబాటులో ఉండకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ప్రమాదాలు జరిగినా, రోగాల బారిన పడిన వారికి అత్యవసర సేవలకు సమీపంలో దుంబ్రిగుడ ఆస్పత్రికి రావాల్సి వస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వంతల వెంకటరావు, సర్పంచ్ పోతంగి పంచాయతీ

క్వార్టర్స్ నిర్మించాలి



కిల్లోగుడ పీహెచ్‌లో రాత్రిళ్లు వైద్య సిబ్బంది ఉండడం లేదు. శివారు గ్రామస్తులు ఎక్కువగా ఈ పీహెచ్‌సీకే వస్తుంటారు. రాత్రి వేళల్లో అత్యవసర సేవలు అందించేందుకు సిబ్బంది లేక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి కిల్లోగుడ ఆరోగ్య కేంద్రంలో క్వార్టర్లు నిర్మాణం చేపట్టాలి.

– పాలకి. ప్రసాదరావు, టిక్కిలిబెడ్డ గ్రామం, దుంబ్రిగుడ

స్తంభించిన సెల్ సిగ్నల్ వ్యవస్థ

- వినిమోగదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


వనభంగి ఎయిర్ టెల్ సెల్ టవర్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

పెదబయలు: పంచాయతీ కేంద్రానికి సెల్‌టవర్ నిర్మాణం జరిగిందని ఆనందపడ్డామని , అయితే నాలుగు నెలల నుంచి సెల్ సిగ్నల్ లేక అవస్థలు పడుతున్నామని వనభంగి పంచాయతీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వనభసింగి పంచాయతీ కేంద్రంలో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ టవర్ ఏర్పాటుచేశారని, కొద్ది రోజులకే సిగ్నల్ వ్యవస్థ అందుబాటులో వచ్చిందన్నారు. దీంతో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌నే గ్రామస్తులంతా ఆశ్రయించామన్నారు. అయితే నాలుగు నెలలుగా సిగ్నల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. అత్యవసరంగా 108, 104, అంబులెన్స్ వంటి సేవలకు ఫోన్ చేసేందుకు సెల్ సిగ్నల్ పనిచేయకపోవడంతో పంచాయతీ కేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపై వెళ్లి ఫోన్ చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సెల్ సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలని వారు వేడుకుంటున్నారు. ఎయిర్‌టెల్ సెల్ సిగ్నల్ సేవల సమస్యపై బుధవారం వినియోగదారులంతా టవర్ వద్ద ఆందోళన చేశారు. అధికారులు త్వరితగతిన సమస్య పరిష్కరించాలని కోరారు. నాయకులు పవన్, సురేంద్రకుమార్, నరేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన


వ్యక్తిగత పరిశుభ్రత ప్రచార పోస్టర్‌నుఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, తదితరులు

సాక్షి, పాడేరు: కౌమార బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అన్నారు. కేసీ మహేంద్ర ఎడ్యుకేషనల్ ట్రస్ట్, నాంది ఫౌండేషన్‌లు సంయుక్తంగా మెనుస్ట్రల్ డే ను నిర్వహించాయి. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ మెన్‌స్ట్రల్ హైజీన్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అవగాహన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌమార బాలికల సంక్షేమానికి కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. కౌమార బాలికలు ఉపయోగించే మెనుస్ట్రల్ కప్పను సరఫరా చేయాలని ఆయా సంస్థలను కలెక్టర్ కోరారు. జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, డీఆర్‌వో పద్మలత, సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, డ్వామా పీడీ విద్యాసాగర్ పాల్గొన్నారు.

చింతపల్లి: కిశోర బాలికలు రుతుక్రమంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. చింతపల్లిలో వాసవ్య మహిళా మండలి సభ్యులు, ఐసీడీఎస్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ అనూషదేవి మాట్లాడుతూ రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఏపీఎం శ్రీనివాసరావు, సీడీపీవో జి.వి.రమణ, వాసవ్య మహిళామండలి కో–ఆర్డినేటర్ బి.సుబ్బారావు, సూపర్‌వైజర్లు ఉన్నీషాబేగం, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.


చింతపల్లిలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ అనూషదేవి, ఏపీఎం శ్రీనివాసరావు

సోలార్ యూనిట్ల పంపిణీ


సోలార్ ప్యానల్స్ అందజేస్తున్న అధికారులు, సర్పంచ్,

రాజవొమ్మంగి: పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా మండలంలోని చికిలింత పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న 20 ఆదివాసీ కుటుంబాలకు బుధవారం సోలార్ యూనిట్లను పంపిణీ చేశారు. విద్యుత్ కనెక్షన్లు, లైన్లు లేని చోట ఈ సోలార్ ప్యానల్స్ అందజేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ సోలార్ విభాగ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వీటి విలువ రూ.14 లక్షలు ఉన్నట్టు చెప్పారు. సోలార్ పరికరాల కోసం మరి కొంతమంది దరఖాస్తు చేసుకొన్నారని, అర్హులను గుర్తించి వారికి కూడా సోలార్ ప్యానల్స్ మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. ఒక్కో కుటుంబానికి 5 బల్బులు, ఒక ఫ్యాన్, 300 వాట్స్ సామర్థ్యం గల సోలార్ ప్యానల్, ఇన్వర్టర్ ఇవ్వడం జరిగిందన్నారు. సర్పంచ్ కోండ్ల సూరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో సీట్లు భర్తీ

పాడేరు : పాడేరు ఐటీడీఏ పరిధిలోని మూడు గిరిజన గురుకుల బాలికల కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాల కోసం కేటాయించిన 450 సీట్లకు కౌన్సెలింగ్ పూర్తి చేసి భర్తీ చేసినట్టు గిరిజన సంక్షేమ శాఖ డీడీ రజనీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు, అరకువ్యాలీ, జీకే వీధి గిరిజన గురుకుల బాలికల కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 240 సీట్లు, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో 160 సీట్లు, సీజీఏ, ఏఅండ్‌టీ ఒకేషనల్ కోర్సులకు 50 సీట్లను కౌన్సిలింగ్ నిర్వహించి పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం గిరిజన గురుకుల బాలికల కళాశాలల్లో ఎటువంటి ఖాళీలు లేనట్టు తెలిపారు.

ఆరు బైక్‌లు స్వాధీనం– ఇద్దరు అరెస్టు


స్వాధీనం చేసుకున్న బైకులతో ఎస్ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి: చింతపల్లి పరిధిలో దొంగతనాలకు గురైన ఆరు బైకులను స్వాధీనం చేసుకుని ఇద్దరని అరెస్టు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులకు వివరాలను తెలియజేశారు. చింతపల్లి డిగ్రీ కళాశాల వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానిత వాహనాలను గుర్తించి ఇద్దరిని అదుపులో తీసుకున్నటుట చెప్పారు. ఇందులో భాగంగా జి మాడుగుల మండలం సాడెక్ పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒక్కరిని, చింతపల్లి మండలం గొందిపాకలు పంచాయితీ వంతలమామిడి గ్రామానికి చెందిన వారిని గుర్తించామన్నారు. వీరివురిలో ఒకరిపై 6 కేసులు, మరొకరిపై 3 కేసులు పాడేరు, మాకవరపాలెం, కొయ్యూరు, జి.మాడుగుల పోలీసు స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బైకులను కోర్టు ద్వారా వాహన యజమానులకు అప్పగించినట్టు చెప్పారు. తమ పోలీసు స్టేషన్‌లో అందిన ఫిర్యాదుల మేరకు ఆరు బైకులను స్వాధీనం చేసుకోవడం జరిగినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఏఎస్ఐ తాతాలు తదితరులున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటరమణ

దుంబ్రిగుడ (అరకులోయ టౌన్): దుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి పి.వెంకటరమణ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పీఎంజన్‌మన్ పథకం ద్వారా నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. గృహ నిర్మాణాలు వేగంవంతం చేయాలని సూచించారు. ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబు, డీఈఈ రాజాబాబు, ఏఈలు క్రాంతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


కార్తీక్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయమందిస్తున్న సంఘం ప్రతినిధులు

పెదబయలు: మండలంలోని పర్రెడ గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీతగుంట గ్రామ పంచాయతీ రోగులపేట గ్రామానికి చెందిన చెందిన జర్సింగి కార్తీక్ ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబానికి రాష్ట్ర, జిల్లా ఇంజనీరింగ్ అసిస్టెంట్ సంఘం నాయకులు రూ.95,500 ఆర్థిక సాయం అందించారు. సంఘం నాయకులు మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు అందించడానికి కృషి చేస్తామన్నారు. జిల్లా అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్లు సంఘ నాయకులు చాణక్య, పెదబయలు, జి.మాడుగుల మండలాల అధ్యక్షులు బొంజుబాబు, సింహాచలం, ఇతర మండలాల నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం


దుంబ్రిగుడలో యోగాసనాలు వేస్తున్న ఉపాధి వేతనదారులు


ఎటపాకలో ఆసనాలు వేస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఎన్ఆర్ఈజీఎస్ క్షేత్రస్థాయి సిబ్బంది, వేతనదారులకు యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దుంబ్రిగుడ మండలంలోని పోతంగి పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ శాంతకుమారి ఆధ్వర్యంలో యోగసనాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేతనదారులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, రోజూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు.


గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

హుకుంపేట: మండలంలోని ఉప్ప గ్రామంలో ఉపాధి వేతనదారులకు యోగా ఆవశ్యకతను వివరించారు.

ఎటపాక: మండలంలోని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ యోగాపై సిబ్బందికి అవగాహన కల్పించారు. యోగాసనాలు వేయించారు. టీచర్ కృష్ణార్జునరావు యోగపై శిక్షణ ఇచ్చారు.

గంగవరం : మండల కేంద్రంలో ఉపాధి వేతనదారులకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మణరావు, ఏపీవో ప్రకాశ్, ఏపీఎం షణ్ముఖరావు తదితరులు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా అమ్మవారి జాతర


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గంగవరం: మండలంలోని నూగుమామిడి గ్రామంలో గంగాలమ్మ అమ్మవారి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు పాల్గొని భక్తులతో కలిసి అమ్మవారికి పూజలు చేశారు. ఉత్సవాల నిర్వహణకు రూ.2లక్షలను విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. హైందవ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఆయన కోరారు.కోలాటం ప్రదర్శనలో ప్రతిభకనబర్చిన వారికి రూ.10వేల నగదును అందజేశారు. అనంతరం అముదాలబంధ గ్రామంలో సందర్శించి, అక్కడ రామాలయం నిర్మాణం కోసం లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. బీజేపీ నాయకులు స్వప్న కుమారి, బాపన్న దొర, ధర్మరాజు, నానాజీ, వీరాంజనేయులు, వనవాసి కల్యాణ ఆశ్రమం జిల్లా అధ్యక్షుడు కాటం రెడ్డి, వెంకట కృష్ణ, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అబ్బాయి రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శివెంకటేశ్వర్లు,విశ్వనాథం, శ్రీను, ఆనంద్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గిరిజన మహిళల కోలాటం

అధ్వాన దారితో అవస్థలు


అప్పలరాజుపేట రహదారి దుస్థితి

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగికి మూడు కిలోమీటర్ల దూరంలో గల అప్పలరాజుపేట గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువును తలపిస్తోంది.10 కిలోమీటర్ల దూరంలోని అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, కొత్త వీధి, ముర్లవారివీధి తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట వరకు కోటి రూపాయల నిధులతో బీటీ రహదారి మంజూరైంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు చేయలేదు. ఇటీవల అధికారులు కొంత మేర పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేసారు. దీంతో వర్షాలకు పెద్ద పెద్ద గోతులు పడి నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వాహనచోదకులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి పూర్తి చేసి, అయిదు గ్రామాలకు రవాణా సదుపాయం కల్పించాలని కోరుతున్నారు

నేడు మరిడిమాంబ పండగ

కె.కోటపాడు : మండలంలో ఆర్లి గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసినట్టు గ్రామ పెద్దలు తెలిపారు. రాత్రికి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

వేంకటేశ్వర స్వామి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మాడుగుల రూరల్ : కె.జె.పురంలో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు ఈ నెల 31వ తేదీ పెళ్లిరాట కార్యక్రమంతో ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను బుధవారం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామకొండలరావు సారథ్యంలో విడుదల చేశారు. వచ్చే నెల 5వ తేదీన స్వామి వారి నిజరూపదర్శనం, 6వ తేదీ ఉదయం స్వామి వారి వార్షిక తిరుకల్యాణం జరుగుతుంది. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నారు. జూన్ 6వ తేదీన భజన పోటీలు ఏర్పాటు చేసి నగదు బహుమతులు అందజేస్తారు. అలాగే ఆలయం వద్ద ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. 11వ తేదీన నాగవల్లి సంబరాలు, రాత్రికి పుష్పాంజలి సేవ, దర్పణ దర్శనం, పవలింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.